ఇష్టారాజ్యంగా ఇసుక తవ్వకాలు

- సుంకెట్ పెద్దవాగుపై పెత్తనం చెలాయిస్తున్న ఇసుక వ్యాపారులు
- ఒకే వే బిల్లుపై రెండు, మూడు ట్రిప్పుల ట్రాక్టర్ల ఇసుక తరలింపు
- ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్న వ్యాపారులు
- పోలీసుల తనిఖీల్లో తప్పుడు వే బిల్లులతో పట్టుబడిన ట్రాక్టర్లు



సుంకెట్ వాగులో ఇసుకను తవ్వి ట్రాక్టర్లలో నింపుతున్న కూలీలు

మోర్తాడ్(బాల్కొండ): మోర్తాడ్ మండలం సుంకెట్ పెద్దవాగు నుంచి ఇసుకను తరలించే విషయంలో కొందరు వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఇసుక తరలింపులో నిబంధనలను తుంగలో తొక్కి ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారు. వారం రోజుల కింద ఆర్మూర్ వైపు ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను వేల్పూర్ పోలీసులు తనిఖీ చేయగా తప్పుడు వే బిల్లులతో ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నారని వెల్లడైంది. పోలీసులు ఇసుక ట్రాక్టర్లను స్టేషన్‌కు తరలించగా ఆ వ్యాపారి జరిమానా చెల్లించి వాహనాలను విడిపించుకున్నాడు. ఈ తంతును పరిశీలిస్తే అధికారికంగా వే బిల్లుల ద్వారానే ఇసుకను తరలిస్తున్నా అక్రమాలకు పాల్పడుతున్న వ్యాపారులు ప్రభుత్వ ఖజానాకు సరిగా సొమ్ము జమ చేయకుండానే తమ దందా కొనసాగిస్తున్నారని స్పష్టమౌతోంది. సుంకెట్ వాగు నుంచి మోర్తాడ్, కమ్మర్‌పల్లి, ఆర్మూర్, బాల్కొండ, వేల్పూర్ మండలాలకు ఇసుకను తరలించడానికి అనుమతి ఉంది. ఎవరు ఇసుక అవసరం ఉన్నా వారు అధికారుల నుంచి అనుమతులు తీసుకుని ట్రాక్టర్లను ఏర్పాటు చేసుకుని ఇసుకను తరలించవచ్చు. కాగా సుంకెట్‌కు చెందిన కొందరు వ్యాపారులు పెద్దవాగుపై పెత్తనం చెలాయిస్తూ ఇసుకను రవాణా చేయడానికి పొరుగు గ్రామాల వారికి అడ్డు తగులుతున్నారు. తమ గ్రామం నుంచి తామే ఇసుకను రవాణా చేయాలనే డిమాండ్‌తో ఇతర గ్రామాల వారికి ఇసుకను రవాణా చేసుకునే అవకాశం కల్పించడం లేదు. ఫలితంగా తాము నిర్ణయించిన ధరకే ఇసుకను విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. డిమాండ్‌ను బట్టి ఇసుక తరలించడానికి అనుమతులు పొందుతూ వే బిల్లులు జారీ చేసిన వాటి కంటే ఎక్కువ ట్రాక్టర్లలో ఇసుకను తరలిస్తూ దందా కొనసాగిస్తున్నారు. సుంకెట్ ఇసుక పాయింట్‌పై గట్టి నిఘా ఏర్పాటు చేసి అక్రమాలకు అవకాశం ఇవ్వకుండా పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఉల్లంఘిస్తే కఠిన చర్యలు..

సుంకెట్ ఇసుక పాయింట్ నుంచి ఇసుకను తరలించే విషయంలో నిబంధనలు ఎవరైనా ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. వేల్పూర్ పోలీసులు ఇసుక ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్న విషయం మా దృష్టికి రాలేదు. వివరాలు సేకరించి మళ్లీ తప్పులు జరగకుండా చూస్తాం.

– సత్యనారాయణ, తహసీల్దార్, మోర్తాడ్

తండాల అభివృద్ధికి మొదటి ప్రాధాన్యత

- ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి



జయంతి కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే

మాక్లూర్: తండాల అభివృద్ధికి మొదటి ప్రాధాన్యత ఇస్తానని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి గిరిజనులకు హామీ ఇచ్చారు. గురువారం మాణిక్ బండారు తండాలో కార్పొరేటర్ రాయ్ సింగ్, అమ్రాద్ తండాలలో మాజీ సర్పంచ్ కిషన్ లాల్ నేతృత్వంలో జరిగిన సేవాలాల్ జయంతిలో పైడి రాకేష్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. ప్రకృతితో మమేకమై ఉన్న గిరిజనులు సమాజానికి ఎంతో మేలు కలిగిస్తారని అన్నారు. అడవులను ఆధారంగా చేసుకుని జీవనోపాధి సాగించే వీరికి గతంలో ఏ ప్రభుత్వాలు మేలు చేయలేదన్నారు. తండాలు నేటికి కూడా అభివృద్ధికి నోచుకోకపోవడం విచారకరమన్నారు. అనంతరం సేవాలాల్ ఆలయంలో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో జే క్రాంతి పాల్గొన్నారు.

తాగు నీరు కలుషితం కావొద్దు

మాక్లూర్: తాగు నీరు కలుషితం కాకుండా జాగ్రత్త పడాలని జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, అధికారులకు సూచించారు. ప్రత్యేక పారిశుధ్య వారోత్సవాల్లో భాగంగా చివరి రోజు గురువారం మాదాపూర్‌లో ఎంపీడీవో జె క్రాంతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి జెడ్పీ చైర్మన్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. తాగునీటి కలుషిత వల్లే గతంలో అతిసార వంటి వ్యాధులు వచ్చేవి గుర్తు చేశారు. కులాయిలు, ట్యాంకులు ఎప్పటికప్పుడు శుభ్రం చేయించటంలో అధికారులు నిర్లక్ష్యం చేయవద్దన్నారు. పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. అనంతరం మండల స్థాయి అధికారులు, స్థానిక ఎంపీటీసీ కలిసి చైర్మన్‌ను సన్మానించారు.

విప్లవమే పునాదిగా మూడు పార్టీల విలీనం

ఎడపల్లి(బోధన్): మూడు విప్లవ పార్టీలు విలీనమై ఒకే విప్లవ పార్టీ మాస్ లైన్ ప్రజాపంథాగా మారబోతుందని సీపీఎంఎల్ ప్రజా పంథా జిల్లా కార్యదర్శి వనమాల కృష్ణ పేర్కొన్నారు. జానకంపేటలో గురువారం సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. మూడు విప్లవ పార్టీల విలీన జాతీయ మహాసభలు మార్చ్ 3, 4, 5 తేదీ ల్లో ఖమ్మం పట్టణంలో జరుగుతాయన్నారు. గ్రూపులుగా ఉన్న విప్లవ పార్టీలు ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా ఐక్యం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. నాయకులు ఎం నరేందర్, గుమ్మల గంగాధర్, డివిజన్ కార్యదర్శి డి రాజేశ్వర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యార్థులు కష్టపడి చదవాలి



పెర్కిట్(ఆర్మూర్): విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకొని కష్టపడి చదవాలని ఎంపీపీ పస్క నర్సయ్య అన్నారు. ఆలూర్ మండల కేంద్రం మచ్చర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్ అవసరమైన కుర్చీలను రోటరీ క్లబ్(ఆర్మూర్) సభ్యులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ఉన్నత చదువులు చదివి పాఠశాల, గ్రామానికి మంచి పేరు తేవాలన్నారు. రోటరీక్లబ్ అధ్యక్షుడు పట్వారి గోపి కృష్ణ మాట్లాడుతూ..10వ తరగతి పరీక్ష ఫలితాల్లో 10జీపీఏ సాధించిన విద్యార్థులకు ఇంటర్మీడియట్ సంబంధించిన పుస్తకాలను ఉచితంగా అందజేస్తానని హామీ ఇచ్చారు. అలాగే పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్స్‌ను తులిసి కుమార్ వితరణ చేశారు.

బోధన్ ఏసీపీగా శ్రీనివాస్



బోధన్‌టౌన్(బోధన్): బోధన్ ఏసీపీగా శ్రీనివాస్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఏసీపీగా పనిచేసిన కిరణ్‌కుమార్ బదిలీపై వెళ్లడంతో హైదరాబాద్ ఐటీ సెల్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్ బోధన్ ఏసీపీగా బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడారు. బోధన్ డివిజన్ పరిధిలో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా గట్టి చర్యలు చేపడుతానన్నారు.

ఉపాధి కల్పించండి

నవీపేట: నవీపేట మేజర్ జీపీ పరిధిలో గతంలో అటెండర్‌గా పనిచేసిన లలిత గురువారం తన భర్తతో కలిసి జీపీ కార్యాలయం ముందు నిరసనకు దిగారు. అనారోగ్యంతో ఉన్న తన భర్త శంకర్‌తో కలిసి బైఠాయించారు. చావుబతుకులో ఉన్న తన భర్తను ఆదుకోవాలని, తనకు ఉపాధి చూపించాలని కోరుతూ నిరసన వ్యక్తం చేశారు. అర్ధంతరంగా విధుల నుంచి తొలగించడమే కాకుండా, పక్షపాత వైఖరితో ప్రజాపాలన దరఖాస్తులపై విచారణకు రావడం లేదని ఆవేదనతో ఆరోపించారు.

బాధ్యతల స్వీకరణ



వేల్పూర్: వేల్పూర్ మండల పరిషత్తు అభివృద్ధి అధికారిగా నూతనంగా నియమితులైన బాలకిషన్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఆయనను మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గడ్డం నర్సారెడ్డి, నాయకులు రాజేందర్, రాజేశ్వర్, నరేందర్, రమణ తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు.

రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపిక



కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలోని మినిమి హైస్కూల్ విద్యార్థులు రియా, గగనశ్రీ, నమిత, ఉప్లూర్ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థులు దివ్య, కృష్ణశ్రీ రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు కరస్పాండెంట్ బాలి రవీందర్, పీఈటీ మధురిమ తెలిపారు. గురువారం ఆర్మూర్ నవ్యభారతి గ్లోబల్ హైస్కూల్‌లో హ్యాండ్ బాల్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విద్యార్థులు ఉత్తమ ప్రతిభ ప్రదర్శించి జిల్లా జట్టుకు ఎంపికయ్యారు. ఈ నెల 17 నుంచి 19 వరకు కరీంనగర్‌లో నిర్వహించే 53వ రాష్ట్ర స్థాయి హ్యాండ్ పోటీల్లో పాల్గొంటారని వివరించారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని మహాత్మా జ్యోతిబా పూలే రెసిడెన్షియల్ పాఠశాలలో గురువారం ఎనీమియా ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు రక్త హీనత పరీక్షలు నిర్వహించారు. డిప్యూటీ డీంఎంహెచ్‌వో విద్య, పాఠశాలలో కార్యక్రమ నిర్వహణను పరిశీలించి మాట్లాడారు. హిమోగ్లోబిన్ తక్కువగా ఉన్న పిల్లలకు రక్తాన్ని వృద్ధి చేసే మాత్రలు అందజేస్తున్నామన్నారు. రాష్ట్రీయ బాల సంస్థ మొబైల్ టీం మెడికల్ అధికారి విజయ్ భాస్కర్, హెచ్‌ఎం హరిబాబు ఉన్నారు.

పరిశుభ్రతను పాటించాలి

వర్ని: గ్రామాల్లో ప్రతి ఒక్కరూ పరిశుభ్రతను పాటించాలని చందూర్ ఎంపీపీ లావణ్య రామ్ రెడ్డి సూచించారు. పారిశుధ్య వారోత్సవాల్లో భాగంగా గురువారం ఏర్పాటు చేసిన గ్రామసభలో ఎంపీపీ మాట్లాడుతూ.. రోగాలు, దోమలు దరిచేరకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. వైస్ ఎంపీపీ దశ గౌడ్ ఉన్నారు.

ఊరూరా గ్రామసభలు

రెంజల్(బోధన్): ప్రత్యేక పారిశుధ్య వారోత్సవాల చివరి రోజైన గురువారం మండలంలో ఊరూర గ్రామసభలను ఆయా గ్రామాల ప్రత్యేకాధికారుల ఆధ్వర్యంలో నిర్వహించారు. వారోత్సవాల్లో చేపట్టిన కార్యక్రమాలను గ్రామస్తులకు కార్యదర్శులు వివరించారు. పలు గ్రామాల్లో జీపీ కార్మికులను సత్కరించారు.

కాంగ్రెస్ పార్టీలో భారీగా చేరికలు



కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానిస్తున్న వినయ్ రెడ్డి

మాక్లూర్: అమ్రాద్‌లో గురువారం ఆర్మూ ర్ నియోజకవర్గ నాయకుడు పొద్దుటూరు వినయ్ రెడ్డి సమక్షంలో పలువురు నేతలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. కారోబార్ల సంఘం జిల్లా అధ్యక్షుడు సూరజి సుధాకర్‌తో పాటు మాజీ సర్పంచ్ మల్ల గౌడ్, మాజీ ఎంపీటీసీ బుర్ర నందకుమార్, లక్కపాటి దేవేందర్, దాసరి రాములు, టి రమేష్, ఎస్ రాజు, ఒడ్డెన్న, లక్కపాటి అశోక్, ప్రవీణ్, ఎస్ ఒడ్డెన్న తదితరులు కాంగ్రెస్‌లో చేరిన వారిలో ఉన్నారు. ఓబీసీ సెల్ మండల అధ్యక్షుడు రొడ్డ భాస్కర్, గ్రామ అధ్యక్షుడు రమేష్ పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధి పనులకు నిధులు

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం చేపూర్, కోమన్‌పల్లి, ఫత్తేపూర్ గ్రామాలలో గురువారం పొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి పర్యటించారు. గ్రామ అభివృద్ధి కోసం ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయిస్తానని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రత్యేక అధికారులు గ్రామస్తులతో కలిసి చర్చించి ప్రభుత్వానికి నివేదికలు అందజేయాలని కోరారు. గ్రామ ప్రత్యేక అధికారి డాక్టర్ ప్రభాకర్, ఆర్మూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు చిన్నా రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బోధన్ మున్సిపల్ చైర్ పర్సన్‌ను కలిసిన కమిషనర్



మున్సిపల్ చైర్ పర్సన్ తూము పద్మాశరత్ రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కమిషనర్

బోధన్‌టౌన్(బోధన్): బోధన్ మున్సిపల్ కమిషనర్‌గా వెంకట నారాయణ గురువారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మున్సిపల్ చైర్ పర్సన్ తూము పద్మాశరత్ రెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. పట్టణంలో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తానని, పట్టణ అభివృద్ధికి కృషి చేస్తానని, కౌన్సిలర్లు ప్రజలు సహకరించాలని ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ కోరారు.

సమస్యలు రాకుండా చూస్తాం

సాక్షి ఎఫెక్ట్..



సమస్యలు తెలుసుకుంటున్న ఆర్‌సీవో సత్యనాథ్ రెడ్డి

వర్ని: విద్యార్థులకు భోజనాన్ని అందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన భోజన ఏజెన్సీ నిర్వాహకుడిపై చర్యలు తీసుకుంటామని ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ఆర్‌సీవో సత్యనాథ్ రెడ్డి అన్నారు. గురువారం సాక్షి దినపత్రికలో వచ్చిన తిండికి తిప్పలు వార్తకు స్పందించిన ఆయన పాత వర్ని గ్రామంలోని మహాత్మ జ్యోతిబాపూలే బాలికల రెసిడెన్షియల్ పాఠశాలను పరిశీలించారు. నిర్వాహకుడిపై చర్యలు తీసుకుంటామని, అవసరమైతే ఏజెన్సీ నిర్వాహకుడ్ని మార్చేస్తామని చెప్పారు. ఆహారం విషయంలో మరోసారి ఆలస్యం కాకుండా చూసుకోవాలని ప్రధానోపాధ్యాయురాలికి సూచించారు. పాఠశాలలో ఫుడ్ క్యాటరింగ్ చేసే వ్యక్తితో సమస్యలు ఉన్నాయని ఆమె అన్నారు. ఒక్కోసారి సడన్‌గా వంట చేసే సిబ్బంది రావడంలేదని ఈ విషయంలో నిర్వాహకుడు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాడని ఆరోపించారు.

భూములు కాపాడాలని అంబేడ్కర్‌కు వినతి

డొంకేశ్వర్(ఆర్మూర్): మండల కేంద్రంలో పంచాయతీ భూములు కబ్జాకు గురవుతున్నా అధికారులు పట్టించుకోకపోవడాన్ని నిరసిస్తూ డొంకేశ్వర్ గ్రామస్తులు అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. అనంతరం తహసీల్ కార్యాలయం ముందు రిలే నిరాహార దీక్షలు కొనసాగించారు. అధికారులు స్పందించి జీపీ భూములకు కంచె వేసే వరకు రోజుకో రీతిలో నిరసన తెలుపుతామని చెప్పారు.

కాంగ్రెస్‌లో చేరిన జెడ్పీ వైస్ చైర్‌పర్సన్



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

ఎడపల్లి: జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ రజితయాదవ్ దంపతులు గురువారం కాంగ్రెస్‌లో చేరారు. హైదరాబాద్‌లో బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి సమక్షంలో వారు హస్తం గూటికి చేరారు. ఎడపల్లి మండల కేంద్రానికి చెందిన రజితయాదవ్ బీఆర్‌ఎస్ నుంచి జెడ్పీటీసీగా ఎన్నికై వైస్ చైర్‌పర్సన్ పదవి చేపట్టారు. తాజాగా కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు పులి శ్రీనివాస్, బిల్లా రామ్మోహన్, నారాయణరావు, లింగం, కామప్ప, కృష్ణ ఉన్నారు.

పలు గ్రామాల్లో ఎంపీడీవో పర్యటన



భీమ్‌గల్: దేవన్‌పల్లి, పల్లికొండ, బాచన్‌పల్లి, పిప్రి గ్రామాల్లో ఎంపీడీవో గంగుల సంతోష్ కుమార్ గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో సంతోష్ కుమార్ ఆయా గ్రామాల పంచాయతీ సిబ్బందితో కలిసి పారిశుధ్య పనులు, తాగు నీటి సౌకర్యాలపై సమీక్షించారు. నర్సరీలు, పల్లె ప్రకృతి వనాలు, కంపోస్ట్ షెడ్‌లను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఏపీవో నర్సయ్య, ఆయా గ్రామాల కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎన్నికల వేళ ప్రక్షాళన

- గులాబీ ముద్ర చెరిపేయడమే లక్ష్యంగా బదిలీలు
- ఆర్మూర్‌లో ఈ విషయమై సర్వత్రా చర్చ

ఆర్మూర్: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఆర్మూర్ రెవెన్యూ డివిజన్ కేంద్రంలో గత ప్రభుత్వ హయాంలో గులాబి ముద్ర వేసుకొని ప్రజల నుంచి, ప్రతిపక్ష పార్టీల నాయకుల నుంచి విమర్శలు ఎదుర్కొన్న అధికారులను రాష్ట్ర ప్రభుత్వం బదిలీ చేస్తూ ప్రక్షాళన మొదలు పెట్టింది. ఆర్మూర్ ఏసీపీ జగదీశ్ చందర్‌తో పాటు మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ చౌహాన్, తహసీల్దార్ శ్రీకాంత్, ఎస్‌హెచ్‌వో సురేష్ బాబు లాంటి ముఖ్య అధికారులను ఏక కాలంలో బదిలీ చేయడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. అయితే వచ్చిన ఈ కొత్త అధికారులైనా అధికార పార్టీ నాయకుల కనుసన్నల్లో విధులు నిర్వహిస్తారా లేక ప్రజల పక్షాన నిలిచి సమస్యలను పరిష్కరిస్తారా అనేది వేచి చూడాల్సిందే.

ఆర్మూర్ ఏసీపీగా బస్వారెడ్డి..



ఆర్మూర్ ఏసీపీ జగదీశ్ చందర్ స్థానంలో బస్వారెడ్డిని బదిలీ చేశారు. బస్వారెడ్డి కమ్మర్‌పల్లి ఎస్సైగా, ఆర్మూర్ సీఐగా విధులు నిర్వహించిన అనుభవం ఉండటంతో పాటు ఇక్కడి సమస్యపై పట్టు ఉండటం ఇక్కడి పరిచయాలు ఆయనకు కలిసి వచ్చే అంశాలు.

ఆర్మూర్ మున్సిపల్ కమిషనర్‌గా రాజు..



ఆర్మూర్ మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ చౌహాన్ బీఆర్‌ఎస్ నాయకుల పైరవీ కారణంగానే ఆర్మూర్‌కు వచ్చారని, ఇటీవల మున్సిపల్ చైర్ పర్సన్ పండిత్ వినీతపై అవిశ్వాస తీర్మానం సమావేశం సమయంలో బీఆర్‌ఎస్ పార్టీకి అనుకూలంగా వ్యవహరించాడంటూ ప్రత్యర్థి వర్గం ఆరోపణలు చేసింది. ఆయన స్థానంలో ప్రస్తుతం మహబూబాద్ జిల్లా పెద్దమర్రి మున్సిపల్ కమిషనర్ రాజు బదిలీపై వచ్చారు.

తహసీల్దార్‌గా గజానంద్..



ఆర్మూర్ తహసీల్దార్‌గా బాధ్యతలు నిర్వహించిన శ్రీకాంత్, ధరణి సంబంధిత సమస్యలు పరిష్కరించడంలో విఫలమయ్యారనే ఆరోపణలు ఉన్నాయి. ఆయన స్థానంలో నిర్మల్ జిల్లా నర్సాపూర్ నుంచి గజానంద్ తహసీల్దార్‌గా బదిలీపై వచ్చారు.

ఎస్‌హెచ్‌వోగా రవి కుమార్..



ఆర్మూర్ ఎస్‌హెచ్‌వోగా విధులు నిర్వహించిన సురేష్‌బాబు బీఆర్‌ఎస్ పార్టీ నాయకులకు అనుకూలంగా వ్యవహరిస్తారనే ఆరోపణలు ఎదుర్కొన్నారు. ఆయన స్థానంలో సిద్దిపేట్ నుంచి రవి కుమార్ బదిలీపై వచ్చారు.

పీఎం కిసాన్ ఈ-కేవైసీని వెంటనే పూర్తి చేసుకోవాలి

బాల్కొండ: రైతులు పీఎం కిసాన్ ఈ కేవైసీని వెంటనే పూర్తి చేసుకోవాలని బాల్కొండ వ్యవసాయ అధికారి మహేందర్‌రెడ్డి సూచించారు. గురువారం బోదేపల్లిలో ఆయన మాట్లాడుతు.. పీఎం కిసాన్ ద్వారా నగదు పొందుతున్న రైతులు ఆధార్ నంబరు, మొబైల్ నంబరు వెంటనే లింక్ చేసుకోవాలన్నారు. బ్యాంకు ఖాతా, ఆధార్ నంబరు లింకు చేసుకోవాలన్నారు. బాల్కొండ మండల పరిధిలో 43 మంది రైతులు ఈ-కేవైసీ చేసుకోవాలన్నారు.

కమిటీల పేరుతో కాలయాపన

- షుగర్ ఫ్యాక్టరీ సమస్యను పరిష్కరించాలి
- బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యెండల లక్ష్మీనారాయణ



రెంజల్‌లో మాట్లాడుతున్న యెండల

రెంజల్: షుగర్ ఫ్యాక్టరీ పునరుద్ధరణకు కాంగ్రెస్ ప్రభుత్వం కమిటీల పేరుతో కాలయాపన చేస్తోందని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యెండల లక్ష్మీనారాయణ అన్నారు. మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికులు, రైతుల జీవితాలతో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ ప్రభుత్వాలు ఆడుకుంటున్నాయని మండిపడ్డారు. దివంగత మాజీ సీఎం వైఎస్‌ఆర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అసెంబ్లీ హౌస్ కమిటీ నివేదికను అమలు చేయాలని డిమాండ్ చేశారు. దేశానికి, ప్రపంచానికి చక్కెరను పంపిణీ చేసిన ఘనత ఉన్న కర్మాగారాన్ని నిర్లక్ష్యం చేయడం సరైంది కాదన్నారు. జీపీల్లో పనిచేస్తున్న కార్మికుల జీతాలు చెల్లించాలన్నారు. సమావేశంలో జిల్లా కిసాన్‌మోర్చ మాజీ అధ్యక్షుడు న్యావనంది గోపాల్, ఎంపీపీ లోలపు రజని, నాయకులు సంతోష్, పోచయ్య, కిశోర్, పోశెట్టి, అశోక్ పాల్గొన్నారు.

ఘనంగా సంత్ సేవాలాల్ జయంతి





దండిగుట్టలో భోగ్ బండార్ నిర్వహిస్తున్న తండావాసులు.. దుబ్బతండాలో..

బంజారా ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ జయంతిని గురువారం జిల్లా వ్యాప్తంగా పలు తండాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సేవాలాల్, దుర్గాదేవి చిత్రపటాలకు ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు భోగ్ బండార్ నిర్వహించారు. సంప్రదాయ జెండాను ఆవిష్కరించారు. యువకులు, మహిళలు సాంప్రదాయ దుస్తుల్లో పాల్గొని నృత్యాలు చేశారు. నిర్వాహకులు అన్నదాన కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. – సాక్షి నెట్‌వర్క్





బోధన్ టౌన్ నర్సాపూర్‌లో భోజనాలు చేస్తున్న మహిళలు, చిన్నారులు సులేమాన్ నగర్ తండాలో..

ధర్మ భిక్షం సేవలు మరువలేనివి



పండ్లు పంపిణీ చేస్తున్న గీత కార్మికులు

రుద్రూర్: గీత కార్మికుల సంక్షేమం కోసం శ్వాస ఉన్నంత వరకు పోరాటం చేసిన మహనీయుడు ధర్మ భిక్షం అని తెలంగాణ గీత పనివారల సంఘం రాష్ట్ర కార్యదర్శి విఠల్ గౌడ్ అన్నారు. కోటగిరి మండల కేంద్రంలో గీత కార్మికులు, గౌడ కులస్తులు గురువారం ధర్మ భిక్షం 102వ జయంతి నిర్వహించారు. అనంతరం కోటగిరి ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విఠల్ గౌడ్ మాట్లాడారు. గీత కార్మికులు టి గంగాధర్ గౌడ్, జి. సాయ గౌడ్, బి.శ్రీకాంత్ గౌడ్ పాల్గొన్నారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లీష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 –	రాజధాని ఫైల్స్ (తెలుగు) - 01.00 మేడమ్ వెబ్(ఇంగ్లీష్)- 4.20, 7.00, 9.40
స్క్రీన్-2 –	ఈగల్ (తెలుగు) - 11.30, 03.00, 6.30, 9.50
స్క్రీన్-3 –	ఊరు పేరు భైరవ కోన(తెలుగు) - 1.00, 4.00, 07.00, 10.00
స్క్రీన్-4 –	మేడమ్ వెబ్(ఇంగ్లీష్)- 12.15 హనుమాన్ (తెలుగు) - 3.30, 6.50 ఓయ్(తెలుగు) - 10.10

అమ్దాపూర్ సొసైటీ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం?

బోధన్‌రూరల్(బోధన్): అమ్దాపూర్ సొసైటీ చైర్మన్(ఎన్‌డీసీసీడీ డైరెక్టర్) గిర్దావర్ గంగారెడ్డిపై ఆ సొసైటీ డైరెక్టర్లు అవిశ్వాసం పెట్టేందుకు సిద్ధమైనట్లు తెలిసింది. అమ్దాపూర్ సొసైటీలో మొత్తం 13 మంది డైరెక్టర్లు ఉండగా గురువారం సుమారు 8 నుంచి 10 మంది డైరెక్టర్లు హైదరాబాద్ క్యాంప్‌కు తరలివెళ్లినట్లు సమాచారం. 2020లో గిర్దావర్ గంగారెడ్డి సొసైటీ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. ఇటీవల రాష్ట్రంలో, బోధన్‌లో బీఆర్‌ఎస్ అధికారం కోల్పోవడంతో అమ్దాపూర్ సొసైటీ ప్రస్తుతం డైరెక్టర్లు కాంగ్రెస్ పార్టీకి మద్దతుదారుడైన ఓ డైరెక్టర్‌ను సొసైటీ చైర్మన్‌గా ఎన్నుకునేందుకు మొగ్గుచూపుతున్నట్లు చర్చ సాగుతోంది. సొసైటీ చైర్మన్ గిర్దావర్ గంగారెడ్డి ఎమ్మెల్సీ కవితకు సన్నిహితుడిగా పేరుంది.

సిద్ధులగుట్ట శివరాత్రి ఉత్సవ కమిటీ ఏర్పాటు

ఆర్మూర్‌టౌన్: నవనాథ సిద్ధుల గుట్టపై శివరాత్రి వేడుకలను నిర్వహించడానికి ఆర్మూర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వినయ్ రెడ్డి ఆధ్వర్యంలో ఉత్సవ నిర్వహణ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీలో భారత్ గ్యాస్ సుమన్, పీసీ గంగారెడ్డి, కోడిగెల మల్లయ్య, గంగాదేవి రైస్ మిల్ సూరజ్, కొంతం మంజుల, ప్రశాంత్ గౌడ్, జిమ్మి సంధ్య, హజారి సతీష్, శ్రీనివాస్ చెందేషి, అలిశెట్టి నరేష్, పొద్దుటూరి చరణ్ రెడ్డి, బట్టు శంకర్‌లు ఉన్నారు.